విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ఉప్పాడ తీరప్రాంత రక్షణకు సమగ్ర ప్రణాళిక

కలెక్టర్ షాన్ మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా యూ కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామం కోతకు గురవుతున్న సముద్ర తీర ప్రాంత రక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నట్టు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌సగిలి అన్నారు. బుధ వారం కలెక్టరేట్‌లో ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి సమగ్ర ప్రణాళిక రూపకల్పనపై కలెక్టర్ షాన్ మోహన్, డీఎఫ్‌ఓ ఎస్ భరణి, నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్-మినిస్ట్రీ ఆఫ్‌ఎర్త్, సైన్స్ (ఎన్‌సీసీఆర్) జాయింట్ సెక్రటరీ డా రమణమూర్తి, సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. నేమామం, ఉప్పాడ గ్రామాల్లో కోతకు గురవుతున్న సముద్ర తీర ప్రాంత, హోప్ ఐలాండ్ ప్రాముఖ్యత, ఫిషింగ్ హార్బర్, కాకినాడ సీపోర్ట్ కార్యకలాపాలు, మడ అడవుల పరిరక్షణ, నలభైఏళ్లుగా కోతకు గురైన తీరప్రాంతం, ఇతర ప్రాంతాల్లో సముద్రతీరం రక్షణకు చేపట్టిన చర్యలు, కాకినాడ పోర్టు నుంచి ఉప్పాడ వరకు తీరప్రాంతానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, భవిష్యత్తులో చేపట్టాల్సిన ప్రాజెక్టులు వంటి అంశాలపై రెవెన్యూ, పంచాయతీ, రోడ్లు భవనాల, ఏపీఐఐసీ, కౌడా, సర్వే, మత్స్య, ఇరిగేషన్, చేనేత, టూరిజం, కాలుష్య నియంత్రణ మండల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పాడ తీర ప్రాంత గ్రామాలను సముద్రపు కోత నుంచి కాపాడేందుకు అవసరమైన ప్రణాళికలు రూపకల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉప్పాడ తీరం లోనే సముద్రం ఎందుకు ముందుకు వస్తోంది? దీనికి గల కారణాలు, తీరాన్ని కోతకు గురి కాకుండా రక్షణ చర్యలపై ఎన్‌సీసీఆర్ జాయింట్ సెక్రటరీ డా. రమణమూర్తి, ఇతర బృందం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికా రులకు వివరించారు. సమావే శంలో జిల్లా రెవెన్యూ అధికారి డా డి తిప్పేనా యక్, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, పంచాయతీ అధికారి కె భారతి సౌజన్య, ఉపాధి శిక్షణ అధికారి జి శ్రీనివాసరావు, రోడ్లు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కాంతు, జిల్లా మత్స్య శాఖాధికారి కరుణాకర్, ఏపీఐఐసీ జెడ్ఎం ఎం రమణారెడ్డి, టూరిజం, కాలుష్య నియంత్రణ మండలి, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన జేసీగా నిశాంతి బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నూతనంగా ఏర్పడిన తరువాత మూడవ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా టి. నిశాంతి బుధవారం స్థానిక కలెక్టరేట్లోని జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. పేద పండితుల వేద మంత్రోచ్చారణ నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆమెకు ఆశీర్వచనాలు పలికారు. తమిళనాడుకు చెందిన నిశాంతి 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెంది ఆంధ్ర ప్రదేశ్ కేడర్‌లో తొలుత ప్రకాశం జిల్లాలో సహాయ కలెక్టర్‌గా శిక్షణ పొందారు. తదుపరి పెనుగొండ సబ్ కలెక్టర్‌గా పని చేశారు. అనంతపురం జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. నంద్యాల జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. అమరావతిలోని రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయంలో జాయింట్ సెక్రటరీగా పనిచేస్తూ బదిలీపై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా నియమింపబడ్డారు. ఉత్తమ అధికారిగా కూడా నిశాంతి పేరు ప్రఖ్యాతులు గడించారు. తొలుత స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు, రామచంద్రపురం రెవిన్యూ డివిజనల్ అధికారి ఎస్ సుధా సాగర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం దుర్గారావు దొర, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె లక్ష్మీనారాయణ ఆమెకు పుష్పగుచ్చాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

రైతుల పక్షాన శాసనసభలో గళమెత్తిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నియోజవర్గం కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు నేడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనసభ దృష్టికి తీసుకు వచ్చి వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రబీ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి గత ప్రభుత్వం పెట్టిన బకాయిల్లో రూ.1000 కోట్లను కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే సమీకరించి రైతులకు అందించడాన్ని ప్రశంసించారు. వారం రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు కోనసీమ జిల్లా రైతులు ఎదుర్కొంటున్న ముంపు సమస్యను సభ దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు రైతులకు రావలసిన మిగిలిన ధాన్యం బకాయిలు రూ.674 కోట్లను సైతం అత్యంత తొందరగా విడుదల చేయాలని సత్యానందరావు సభను కోరారు.

ఎంపీడీఓ వెంకటరమణకు ఘన నివాళి

విశాలాంధ్ర - చాగల్లు : నరసాపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తు ఇటీవల అంతుచిక్కని ప్రశ్నగా అదృశ్యమైన వ్యక్తి విగతజీవిగా అకాల మరణం చెందిన వెంకటరమణ రావు మృతి రాష్ట్రం ప్రజలలో బాధను కలిగించింది.రాష్ట్రంలో ఉన్న తోటి అధికారులు నివాళులు అర్పించారు. తూర్పు గోదావరి జిల్లా, చాగల్లు మండల అభివృద్ధి కార్యాలయంలో సిబ్బంది మొత్తం మృతి చెందిన రమణారావు పట్ల మౌనం వహించి, ఘన నివాళి అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బుజ్జి మాట్లాడుతూ అయన మరణానికి కారకులైన వారి పై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.వారి కుటుంబానికి మేము ఎప్పుడు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమములో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - అమలాపురం : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద ఉధృతి పెరగడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలకోసం పునరావస కేంద్రాలు ఏర్పాటు చేసి తరలించాలని జనసేన పార్టీ నాయకులు లింగోలు పండు అధికారులకు విజ్ఞప్తి చేశారు. గత జగన్ ప్రభుత్వంలో భారీ వరదలకు 2020-21 సంవత్సరానికి గాను కేంద్రం విడుదల చేసిన విపత్తు నిధులు నాటి ప్రభుత్వం దారి మళ్ళించిందని, వీటిపై పూర్తి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ముంపు మండలాలకు లక్షలాది రూపాయలు అంచనా ఉన్నప్పటికీ నిధులు విడుదల కాలేదని తెలిపారు. అధికారులు ముంపు బాధితులకోసం భోజనాలు అరువు తెచ్చిన హొటల్స్, యజమానులకు, అయా గ్రూపు నావల యాజమానులకు అనేక మందికి ఇవ్వవలసిన నిధులు లేక ఇవ్వకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారని అధికారులు ఏమి చెప్పాలో తెలియక ఒత్తిడికి గురవుతున్నారని వెంటనే గత నిధులను కూడా విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లాలో రైతులకు అండగా ఉండాలన్నారు.

చంద్రబాబు సమర్ధతతోనే రాష్ట్రానికి నిధులు

కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి

విశాలాంధ్ర - కాకినాడ : రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు కేటాయించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్ధతకు నిదర్శనమని కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. వలసపాకలలోని తమ నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ఆంధ్ర ప్రజలు అపూర్వ విజయం అందించినందుకు తగిన ఫలితం దక్కిందన్నారు. రాష్ట్ర ప్రజల ఆశలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారా నెరవేరుతున్నాయని, కేంద్ర బడ్జెట్లో రాష్ట్ర పున నిర్మాణం కోసం భారీగా నిధులు కేటాయిస్తున్నట్లుగా ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించడం హర్షణీయమని, చంద్రబాబు దూరదృష్టితో ఎన్డీయే భాగస్వామిగా కీలకపాత్ర పోషించడం వల్లే రాష్ట్ర అభివృద్ధికి నిధుల వరద వచ్చిందన్నారు. వైసిపి నేతలంతా సిగ్గుపడాలని, వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను, రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు.చంద్రబాబు పాలనలో రానున్న ఐదేళ్లలో రాష్ట్ర రూపురేఖలు మారిపోనున్నాయని అన్నారు.

కాకినాడ కమిషనర్‌గా భావన బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి భావన బుధ వారం బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరేందుకు వచ్చిన కమిషనర్ భావనకు బదిలీ పై వెళ్తున్న కమిష నర్ వెంకటరావు, అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, వివిధ విభాగాధిపతులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ భావన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యవంతమైన పరిపాలన అందించాలన్నదే తన ప్రధాన కర్తవ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు స్మార్ట్ సిటీలలో ఒకటైన కాకినాడకు ప్లాన్డ్ సిటిగా పేరుందని, అలాంటి నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేం దుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ పి సత్యకుమారి, కార్యదర్శి ఎం ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, స్మార్ట్ సిటీ సూపరిం టెండెంట్ ఇంజనీర్ పి వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డీసీపీ హరి దాస్, ఏసిపి నాగశాస్త్రులు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కర్రి సత్య నారాయణ, ఏవో శిరీష్, ఈఈ మాధవి, ఉద్యాన సహాయ సంచాలకులు శిరిల్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వెంకటరాజు, శానిటరీ సూపర్వైజర్లు సత్తెప్ప నాయుడు, రాంబాబు, రెవెన్యూ అధికారులు, డిఈలు, ఏఈలు ఉన్నారు.

ముంపు పొలాలు పరిశీలించిన ఏడిఏ బాబురావు

విశాలాంధ్ర - కరప : కరప మండలంలో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించేందుకు నడకుదురు ఏడిఏ బాబురావు విచ్చేశారని, మండల వ్యవసాయ అధికారి ఏవో ఏ రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఏడీఏ బాబురావు మాట్లాడుతూ రైతులు వివిధ దశల్లో ఉన్న పంటలు కాపాడుకోవాలంటే పొలాల్లో ఉన్న నీటిని పూర్తిగా తొలగించి ఎకరాకు 20కేజీల ఫాటాస్, 20 కేజీల యూరియా బూస్టర్డ డోసు ఉద్భిన పొలాలలో జల్లు కోవాలని బాబురావు పేర్కొన్నారు.

వివాదాస్పద ఆవా ఇళ్ల పట్టాల భూమి పరిశీలన

ముంపు బారిన పడకుండా చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - సీతానగరం, రాజానగరం: వివాదాస్పద ఆవా ఇళ్ల పట్టాల భూమిని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పరిశీలించారు. రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలంలో ఆవా భూములలో గృహ లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ పై ప్రజా ప్రతినిధులు తెలియచేసిన అంశాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో కాపవరం, బూరుగుపూడి గ్రామాల అధికారులతో కలిసి కలెక్టర్ ప్రశాంతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల పంపిణీ పథకంలో భాగంగా ఆవ ప్రాంతంలోని కాపవరం, బూరుగుపూడి గ్రామాల్లోని 361 ఎకరాల్లోని భూములను ఇళ్ల స్థలాల కోసం అర్జీ పెట్టుకున్న లబ్దిదారులకు పట్టాలని జారీ చేశారని, అక్కడ ఇళ్ల నిర్మాణాలకు అనుకూలత లేదని ఆ ప్రాంతం ముంపుకు గురి అయ్యే అవకాశం ఉందని తెలిపారు. కావున ఒక సారి క్షేత్రస్థాయిలో పరిశీలించాలి అని కోరారు. ఈ నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను పరిశీలిం చామని అన్నారు. ఆవ భూములు, ఇండ్ల స్థలాలు ముంపునకు గురి కాకుండా చూసేందుకు పరిశీలన చేసి, సమగ్ర సమా చారం సేకరించామని, ఆమేరకు అధికారులు నివేదిక అందచేయాలని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం ముంపుకు గురికాకుండా చూసేం దుకు ఇరిగేషన్ శాఖ పరంగా చేపట్టవలసిన చర్యలు పై క్షేత్ర స్థాయిలో సమీక్షించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఏ చైత్రవర్షిణి, ఇరి గేషన్ డిఈకే ఆనందబాబు, కోరుకొండ తహశీల్దార్ సుమలత ఉన్నారు.

ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - కాకినాడ : రమణయ్యపేట శ్రీ కన్వెన్షన్‌లో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసి యేషన్, కాకినాడ రూరల్ రి 331/2015 నూతన కార్యవర్గం ప్రమా ణ స్వీకారం చేసింది. ముఖ్య అతిథిగా యువనాయకులు పంతం సందీప్ హాజరై ఫోటోగ్రాఫర్లకు కమ్యూనిటీ హాల్ నిర్మించటానికి స్థలము కేటాయించడానికి కృషి చేస్తానని తెలియజేశారు. తరువాత జిల్లా తోట సూర్య సుబ్బారావుచే కాకినాడ రూరల్ నూతన అధ్యక్షులుగా కేజేయెన్ శ్రీనివాసరావు, సలహాదారులు పి సూర్య ప్రకాష్ రావు తుమ్మలపల్లి వీర్రాజు, అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసబాబు, కార్యదర్శి సిహెచ్ రవికుమార్, ఉప కార్యదర్శి బి అనిల్ కుమార్, కోశాధికారి పి సత్యనారాయణమూర్తి, కార్యనిర్వాహణ కార్యదర్శి, పి లోవరాజుచే పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో, జిల్లా అధ్యక్షులు పి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ కమురు, కాకినాడ జోన్ ఇన్చార్జ్ ఎస్ గౌరీ శంకర్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ మనోహర్, కే కుమారస్వామి, ఎం రమేష్, ఈ కళ్యాణ రావు, ఎస్ బాబురావు, కట్టా శ్రీనివాసరావు, పి నాగేశ్వరరావు(నాగు), కట్టా రవి, బొమ్మన వీరభద్ర రావు, డి న్యూటన్, ఎంఎస్ రాజు, రషీద్ అక్బర్, మంజునాథ్, కరుణాకర్, గోపాల్ రాజు, గంగాధర్, కేవివి రమణ, సిహెచ్ వీరబాబు, సోడగం శ్రీను, పి మురళి, లావణ్య ప్రకాష్, ఎం రవీంద్ర, వి రత్న రాజ్, సింహాచలం, కలర్ ల్యాబ్ అధినేతలు, ఫోటో స్టోర్స్ అధినేతలు, ఫోటో వీడియో గ్రాఫర్ సోదరులు పాల్గొన్నారు.

పురాతన దేవాలయాల అభివృద్ధితోనే పర్యాటకరంగం వృద్ధి : ఎమ్మెల్యే బత్తుల

విశాలాంధ్ర - సీతానగరం, రాజానగరం: పురాతన దేవాలయాల అభివృద్ధితోనే పర్యాటక రంగం వృద్ధి చెందుతుందని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే శాసనసభలో మాట్లాడుతూ ప్రముఖ పురాతన దేవాలయాలను కలుపుతూ ప్రత్యేక ప్యాకెజీలను తీసుకురావడం ద్వారా దేవాల యాల అభివృది చేయవచ్చని. తద్వారా పర్యాటకుల సందడితో ప్రత్య క్షంగా పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయని అన్నారు. కోరుకొండ గ్రామంలో వెలసిన పురాతన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి కందులు దుర్గేష్‌ని కోరారు. ముఖ్యంగా 2027లో రాబోయే అఖండ గోదావరి పుష్కరాల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాల అభివృద్ధి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన ఉచిత మగ్గంవర్క్ శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - రాజానగరం : డొక్కా సీతమ్మ, మదర్ థెరిస్సా వంటి మహనీయులను వలే ప్రతి మహిళా ఒక చరిత్ర సృష్టించుకోవాలనీ డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. రంగంపేట మండలంలోని కోటపాడు గ్రామంలో సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించిన ఉచిత మగ్గంవర్క్ శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు 70 మంది మహిళలుకుమండలంలోని దివాన్ చెరువు గ్రామంలోని ఫౌండేషన్ కార్యాలయంలో ధృవపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మగ్గం వర్క్ లో శిక్షణ పొందిన మహిళలు తమ ప్రతిభ కనబరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి,వినీల, యెనుముల సురేష్, యెనుముల తేజ, శిక్షకురాలు అనంత లక్ష్మి, సభ్యులు వీరలక్ష్మి, మంగ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

రూ.22,200ల నగదును అందజేసిన శెట్టిబలిజ సంఘం

విశాలాంధ్ర - మామిడికుదురు : మండల పరిధిలోని లూటుకుర్రు గ్రామానికి చెందిన బొంతు వెంకటేశ్వరరావు (బుజ్జి)కి బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మామిడికుదురు మండలం శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భాధితుడికి వైద్య చికిత్స కోసం రూ.22,200ల నగదును విరాళాలుగా సేకరించారు. ఈ మొత్తాన్ని బుధవారం రాజోలు తాలూకా శెట్టి బలిజ సంక్షేమ సంఘం మండల శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆ వ్యక్తికి అందజేశారు. తామంతా అండగా ఉంటామని బాధిత వ్యక్తికి భోరోసా ఇచ్చారు. ఇప్పటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్‌లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజోలు, మామిడికుదురు మండల సంఘ నాయకులు గుబ్బల శ్రీనివాస్, గుబ్బల మనోహర్, కాండ్రెగుల శ్రీనివాస్, పెచ్చెట్టి సత్య చంద్ర, కడలి నూకరాజు, వాసం శెట్టి రామకృష్ణ, చింతపల్లి సతీష్, చప్పిడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీవో 217 రద్దు చేయాలి

అసెంబ్లీ సమావేశంలో వనమాడి కొండబాబు

విశాలాంధ్ర - కాకినాడ : మత్స్యకారుల జీవనోపాధిని కొల్లగొట్టడానికి వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోనెంబర్ 217ను రద్దు చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో వనమాడి కొండబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మంత్రి వర్యులు అచ్చెన్ననాయుడు మాట్లాడుతూ మత్స్యకారులు శ్రేయస్సు కోసం ఆర్థిక అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, మత్స్యకారుల జీవనోపాధిని కొల్లగొట్టడానికి గత ప్రభుత్వం తీసుకువచ్చిన 217 జీవోను రద్దు చేస్తున్నట్లు అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశంలో కొండబాబు మాట్లాడుతూ దశాబ్దాలు కాలంగా మత్స్యకారులు స్థానికంగా ఉన్నటువంటి గ్రామ పంచాయతీ చెరువులపై, రిజర్వాయర్లపై స్థానిక మత్స్యకారులు ఆధారపడి అనేక కుటుంబాలు జీవనం సాగించేయని, ఆనాడు అన్న ఎన్టీఆర్ చెరువులను రిజర్వార్లపై పూర్తి హక్కులను ఫిషర్మెన్ కోఆపరేటివ్ సొసైటీలకు అందించి మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వనరులను సంపదను దోచుకోవడమే కాకుండా మత్స్యకారులకు సంబంధించిన చెరువులను రిజర్వాయర్లులను కూడా దోచుకోవడానికి జీవో నెంబర్ 217 తీసుకువచ్చిందని, రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులు ప్రతిపక్ష పార్టీలు ప్రజా సంఘాలు అనేక నిరసనలు దీక్షలు చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం కనుకరించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 217ను రద్దు చేస్తామని నారా చంద్రబాబునాయుడు అన్నారని, మాట ఇచ్చిన ప్రకారం నేడు జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఆక్వారంగాన్ని కుదేలు చేస్తున్న ఫీడ్‌మిల్లర్లు

రాష్ట్ర ఆక్వా ఫెడరేషన్ సలహాదారు త్సవటపల్లి నాగభూషణం

విశాలాంధ్ర - అమలాపురం : కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కృషి మూలంగా విదేశాల నుండి దిగుమతి అయ్యే ఫీడ్ పై విధించే విదేశీ సుంకాన్ని 15 శాతం నుండి 5 శాతానికి తగ్గించడంవల్ల రైతాంగానికి ఎంతో మేలు జరిగి ప్రధాని నరేంద్ర మోదీని రైతులు కొనియాడుతుంటే ఆంధ్రప్రదేశ్‌లోని ఫీడ్ మిల్లర్ల అసోసియేషన్ గతంలో పెంచిన ధరలను కొనసాగిస్తూ ఆక్వా రైతాంగాన్ని నిలువునా మోసం చేస్తోందని రాష్ట్ర ఆక్వా ఫెడరేషన్ గౌరవ సలహాదారు త్సవటపల్లి నాగభూషణం ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నాగభూషణం మాట్లాడారు. విదేశాలకు చెందిన యూఎస్‌ఐకి చెందిన విదేశీ కంపెనీలు రొయ్య ల ఫీడ్ గతంలో ఉన్న 15 శాతం ఫీడ్ ధరలను 5శాతానికి తగ్గించా యని దానివల్ల రైతులకు ఎంతో మేలు జరిగి ఫీడ్ ధరలు కెజికి 20 రూపాయల వరకూ తగ్గుతాయని ఆశిస్తుంటే ఫీడ్ మిల్లర్లు అసోసియేషన్ చేస్తున్న మోసం వల్ల అసలే అనేక నష్టాలకోర్చి వెంటిలేటర్‌పై ఉన్న ఆక్వా రంగం కుదేలయిందని నాగభూషణం ఆవేదన చెందారు. విదేశాల్లో 15 నుండి 5 శాతానికి ఫీడ్ ధరల తగ్గిస్తే ఆంధ్రప్ర దేశ్‌లో ఫీడ్ మిల్లర్లు సిండికేట్‌గా మారి పాత ధరలను కొనసాగించడం దారుణమన్నారు. ఫీడ్‌లో కలిపే ఇతర పదార్థాల ధరలు సోయ తదితర ధరలు తక్కువగా ఉన్నాయని అందువల్ల ధరలు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఆక్వా సాగులో 70 శాతం ఉండగా 60 శాతం ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో సాగవుతోందని నాగభూషణం స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ రంగంపై దృష్టి పెట్టి ఫీడ్‌మిల్లర్లు అసోసియేషన్‌తో మాట్లాడి ఫీడ్ ధరలు తగ్గించేలా కృషి చేసి ఆక్వా రంగాన్ని బ్రతికించాలని నాగభూషణం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కష్టాల్లో ఉన్న ఆక్వా రంగాన్ని కాపాడేందుకు ఫీడ్ మిల్లర్లు పెంచిన అధిక ధరలను నియంత్రించి రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని నాగభూషణం కోరారు.

యధేచ్చగా కోడిపందేలు... పట్టించుకోని పోలీసులు

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని వెంగయ్యమ్మపురంలో యధేచ్ఛగా కోడిపందేలు నిర్వహిస్తున్నా, పోలీసులు పట్టించుకోవడం లేదు. పొలాల మధ్య కోళ్ల ఫారంలో ప్రతీ రోజు కోడి పందేలను స్థానిక టీడీపీనేత కనుసన్నల్లో నిర్వహిస్తున్నారు. పోలీసులు వచ్చి మామూళ్లు తీసుకుని వెళ్ళిపోతున్నారని, స్థానిక పొలాల రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కోడి పందాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

డీఎస్సీ, టెట్ ఉచిత కోచింగ్ దరఖాస్తులకు 27 ఆఖరు తేదీ

విశాలాంధ్ర - జగ్గంపేట : జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న డీఎస్సీ, టెట్ ఉచిత కోచింగ్‌కు అప్లికేషన్లను జూలై 27వ తేదీ వరకు తీసుకోంటామని జగ్గంపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త కొండబాబు తెలిపారు. దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కొండబాబు, తోలేటి సూర్యనారాయణలు మాట్లాడుతూ నియోజకవర్గంలోని జగ్గంపేట, గండేపల్లి, గోకవరం, కిర్లంపూడి మండలాల్లోని అన్ని గ్రామాల అభ్యర్థులు డీఎస్సీ కోచింగ్‌కు అర్హులే అన్నారు. ఎనిమిది రోజుల నుంచి అప్లికేషన్లు స్వీకరిస్తున్నామని అన్నారు. నాలుగు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా డీఎస్సీ అభ్యర్థులు రావడానికి ఇబ్బంది పడుతున్నారని, మళ్లీ రెండు రోజుల వరకు అప్లికేషన్ తీసుకుంటామని తెలిపారు. ఈనెల 27వ తేదీ వరకు అప్లికేషన్‌లు స్వీకరిస్తామని అన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆయన ఫౌండేషన్ ద్వారా తన నియోజకవర్గంలోని అనేక మంది ఉచిత డీఎస్సీ ఉచిత కోచింగ్ తీసుకుని టీచర్లుగా ఉద్యోగ అవకాశాలు పొందుతారని కార్పొరేట్ స్థాయిలో బెస్ట్‌ఫ్యాకల్టీని తీసుకువచ్చి ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

విశాలాంధ్ర - సామర్లకోట : శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని సామర్లకోట మండల విద్యాశాఖాధికారి పి పుల్లయ్య పేర్కొన్నారు. శిక్షా సప్తాహ్ మూడో రోజు కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ హైస్కూల్ అయోధ్య రామపురంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ డేను ఎంఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కబడి, మ్యూజికల్ చైర్స్, తొక్కిడి బిళ్ళ, లెమన్ అండ్ స్పూన్, లగోరి (ఏడు పెంకులు)వంటి ఆటలను నిర్వహించారు. హెచ్ఎం సాయి రామకృష్ణ భారతీయ సంప్రదాయ క్రీడల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పదో తరగతి విద్యార్థి యశ్వంత్ కుమార్ ప్రదర్శించిన యోగాసనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎంఈఓ పుల్లయ్య విద్యార్థుల ప్రతిభాపాటవాలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి గోవిందు, వి రాజు, కెవివి సత్యనారాయణ, కే శ్రీనివాస్, ఏఎల్‌వి కుమారి, కే అరుణ, బి శ్రీలక్ష్మి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుమారదేవం గురుకుల పాఠశాల రోడ్డు అస్తవ్యస్తం

విశాలాంధ్ర - కొవ్వూరు రూరల్ : కొవ్వూరు మండలంలోని కుమారదేవం గ్రామంలోని గురుకుల పాఠశాలకి వెళ్లే రోడ్డు గుంతలతో చాలా అస్తవ్యస్తంగా ఉంది. అటు వెళ్లే ప్రయాణికులు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు పడితే ఈ దారిలో వెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉంటుందని, అటు వైపుగా వెళ్లేవారు ఆగుంతల్లో పడి గాయాలపాలవుతున్నారని, ఈరోడ్డును పట్టించుకునే నాధుడే లేదని అక్కడ ఉన్న రైతులు వాపోయారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ నాయకులు, అధికారులు ఈ రోడ్డును పునరుద్ధించాలని కోరారు. దీనిపై అధికారులు, నాయకులు ఎలా స్పందిస్తారు అన్నది వేచి చూడాలి.

పద్మశ్రీ అయ్యంకి సేవలు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - కాకినాడ : గ్రంథాలయ ఉద్యమ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య సేవలు స్ఫూర్తిదాయకమని బాల మందిరం వ్యవస్థాపక అధ్యక్షులు అంగర గోపాలకృష్ణ (కృష్ణ శ్రీ) అన్నారు. అయ్యంకి జయంతి సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా గ్రంథాలయ ఉద్యమ నాయకులు పడవలపై సంచార గ్రంథాలయాలు ప్రవేశపెట్టిన స్ఫూర్తి ప్రదాత కీర్తి శేషులు కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణం వర్ధంతి సందర్భంగా వీరి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత గ్రంథాలయాధికారి కూర్మవరపు సత్యనారాయణని దుస్సాలువతో సత్కరించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు డివి సత్యనారాయణ, గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు వెంకటరమణయ్య, నాగభూషణం జీవిత విశేషాలను, గ్రంథాలయ ఉద్యమ విశేషాలను పాఠకులకు, విద్యార్థులకు వివరించారు.

గుర్రం జాషువా 53వ వర్ధంతి

విశాలాంధ్ర - అమలాపురం : డా బాబూ జగజ్జీవన్ రామ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అసోసియేసన్ అధ్యక్షులు మడికి సత్యనారాయణ అధ్యక్షతన గుర్రం జాషువా 53వ వర్ధంతిని ఎత్తు రోడ్ దగ్గర వెంకట కృష్ణాపురం కాలనీలో వారి గృహం వద్ద జాషువ చిత్రపటానికి పూలమాలలు వేసి బుధవారం ఘనంగా నివాలు లర్పించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు, రిటైర్డ్ బ్యాంక్ మెనేజరు నౌండ్రు వాడపల్లి ప్రముఖ కవి సీలి శాంసన్, సిర్రా కాంతరాజు, నౌండ్రు లక్ష్మణరావు, సింగపల్లి యేసుదాసు, నూటికుర్తి శ్రీనివాసు, కండవల్లి సురేశ్ మొదలగు వారు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి : ఎంపీపీ

విశాలాంధ్ర - పెదపూడి : విద్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ కేతా తులసి అన్నారు. పెదపూడి గ్రామంలోని గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ స్టూడెంట్ కిట్లో నోట్బుక్స్, డిక్షనరి, బ్యాగ్, బెల్టులు, బూట్లు, సాక్స్ మొదలగునవి ఉన్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ, సర్పంచి కలవల కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు వల్లూరి మరియమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, సీహెచ్సీడీసీ మాజీ చైర్మన్ ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, హెచ్ఎం కె సత్యనారాయణ. తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని పాఠశాలల్లో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేపట్టారు.

'టీచ్ టూల్ ట్రైనింగ్'ను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి నాగమణి

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పట్టణ పరిధిలో ఉన్న బి.ఆర్.ఎం.వి మున్సిపల్ హైస్కూల్లో జరుగుతున్న 'టీచ్ టూల్ ట్రైనింగ్' ను బుధవారం కాకినాడ రీజనల్ జాయింట్ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి అకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ట్రైనింగ్‌లో హాజరైన ఉపాధ్యాయుల సంఖ్యను పరిశీలించి సంతృప్తి చెందారు. ఎంఈఓ

వీరాస్వామిని, మాస్టర్ ట్రైనర్స్ ట్రైనీస్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ రోజురోజుకు తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఫిబ్రవరి, మార్చి నెలలలో వార్డులోకి వెళ్లి ఎన్ రోల్ మెంట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. తద్వారా పాఠశాలలో విద్యార్థుల రోల్ పెంచాలని ఉపాధ్యాయులను కోరారు. టీచింగ్ టూల్ ట్రైనింగ్ యొక్క లక్ష్యాన్ని వివరించారు. ప్రత్యేకంగా ఎంపిక కాబడిన వారందరికీ ఈ శిక్షణ ఇవ్వబడు తుందని, ప్రతి అబ్జర్వర్ తమ తమ పాఠశాలలో బోధనా పద్ధతులను, విద్యను బోధించడంలో క్వాలిటీని పెంచుకుంటూ వెళ్లాలని, విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ప్రారంభించి నాలుగు సంవత్సరాలు పూర్తి అయినది నేపథ్యంలో 'శిక్ష సప్తహ్'లో భాగంగా ఈనెల 29న ప్రత్యేక తిథి భోజనాలు కార్యక్రమం నిర్వహించా లని, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు భోజనాలు పెట్టాలని కోరారు. ట్రైనింగ్ సెంటర్లో ప్రతిభ కనబరిచిన టీచర్లకు ఆర్.జెడి జి. నాగమణి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మండల విద్యాశాఖ అధికారి కృష్ణం రాజు, కె.ఎస్.ఎన్ మూర్తి, నగేష్, వి.లక్ష్మీనారాయణ, నరసింహరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఝాన్సీ లక్ష్మీబాయి, ఎల్.ఎఫ్.ఎల్ ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

విశాలాంధ్ర -భీమవరం: పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత సమాజంలో మనందరిపై ఉందని డి.యస్.ఆర్. కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, డి.యస్.ఆర్. వాకర్స్ అసోసియేషన్ అధ్య క్షులు కటికల పల్లారావు అన్నారు. డి.యస్.ఆర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం తైవాన్ జామ మొక్కలను వాకర్స్‌కు

పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులను విచక్షణారహితంగా నరకడం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతిని అనేక అనర్ధాలకు దారితీస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు, జాలీవాకర్ అప్పలరాజు, భీమాల శ్రీరామమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు, రామకృష్ణరాజు, సాయిజీ రావు, బాబ్జి, మృత్యుంజయుడు, మావుళ్ళు, శ్రీనివాస్, మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

పెద్ద తిరుపతి మొక్కు చెల్లించిన ఎన్నారై సతీష్

విశాలాంధ్ర-కామవరపుకోట: ఉద్యోగరీత్యా సింగపూర్ తెదేపా ఎగ్జిక్యూటివ్ మెంబర్, కామవరపుకోట మండలం ఆడమిల్లి గ్రామానికి చెందిన పారేపల్లి సతీష్ కుమార్ చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలని కోరుకుంటూ ఎన్నికల ముందు పెద్ద తిరుపతి వెంకటేశ్వర స్వామి వారికి మొక్కుకున్నారు. కూటమి ప్రభుత్వం



విజయం సాధించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వడంతో సింగపూర్ నుండి ప్రత్యేకంగా వచ్చి అలిపిరి నుండి పాదయాత్ర చేసి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని, తలనీలాలు సమర్పించినట్లు సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ కూడా మంచి జరుగుతుందని, ముఖ్యంగా చంద్రబాబు సారథ్యంలో ఉద్యోగ కల్పన జరుగుతుందని నమ్మకం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఆంధ్ర ప్రజల అదృష్టం అని సతీష్ కుమార్ పేర్కొన్నారు.

దివ్యాంగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన అధికారిపై చర్య తీసుకోండి

విశాలాంధ్ర- ఉంగుటూరు: దివ్యాంగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానపరిచిన అధికారిపై చర్యలు తీసుకోవాలని ఉంగుటూరు మండల దివ్యాంగుల సేవా సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. తొలుత తహసీల్దార్ కార్యాలయం వద్ద రెండు నిమిషాలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం

ఉంగుటూరు తహశీల్దార్ శివయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో దివ్యాంగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆ అధికారిపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సేవాసంఘం మండలాధ్యక్షుడు కె. రాంబాబు, ఉండ్రాజవరపు దుర్గారావు, డి.సత్యనారాయణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కాళ్ల : కాళ్ళ మండలం పెదమిరం గ్రామంలో నూతనంగా నిర్మించబడిన హెల్త్ వెల్నెస్ కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం విధులు ప్రారంభించారని, ఈ అవకాశాన్ని పెదఅమిరం గ్రామ ప్రజలు వినియోగించు కోవాలని గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు కోరారు.మాజీ ఉప సర్పంచ్ లు, కోర

రామమూర్తి, నడింపల్లి సుబ్బ రాజు, అలుగు సెబాస్టియన్ స్థల దాత ముదుండి లక్ష్మి నరసింహారాజు కుటుంబ సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సరాబు సునీల్ మాట్లాడుతూ ఈ నూతన హెల్త్ వెల్నెస్ కేంద్రంలో రోగులు వైద్య పరీక్షలు చేయించుకొని తగు చికిత్స చేయించుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో స్థల దాత ముదుండి లక్ష్మి నరసింహరాజు, డాక్టర్ డి. సునీత, కోరా రామూర్తి, నడింపల్లి సుబ్బరాజు, అలుగు సెభాస్టియన్ వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆకుమడులను పరిశీలించిన వ్యవసాయాధికారులు

విశాలాంధ్ర -మొగల్తూరు: మండలంలోని నీటిముంపునకు గురైన నారుమడులను, వరి నాట్లు వేసిన పొలాలను నర్సాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఏడి ఎ. అనిల్ కుమారి బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ముంపు లాగిన తర్వాత నీటిని బయటకు తోడి

ఆకుమడులకు నత్రజని పొటాష్ ఎరువులను వేసుకోవాలని సూచించారు. ఆకుమడులు పొలాలు తెగుళ్ల బారిన పడకుండా కార్బన్డిజం లేదా మన్ కోడ్ మందును పిచికారి చేయాలన్నారు. రైతులందరూ తమ ఆకుమడులలో నారుమడులను సంరక్షించుకోవాలని తగు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు మండల వ్యవసాయ అధికారి షేక్ అబ్దుల్ రహీం, గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బంది తదితరులు ఉన్నారు..

పరిమితికి మించి ఇసుక తరలిస్తే చర్యలు

విశాలాంధ్ర -పోలవరం : ఇసుక అక్రమ రవాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఎస్.సురేష్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం పోలవరం మండల కేంద్రంలో స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ అమలు చేయనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇసుక అక్రమ రవాణా పై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించి నట్లు తెలిపారు.సబ్ డివిజన్ పరిధిలో కుక్కునూరులో వింజరం, ఇబ్రహీంపేటలో ఇసుక

ర్యాంపులు ఏర్పాటు జరగనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ కమిటీ సభ్యులుగా ఇసుక ర్యాంపుల ఏర్పాటు జరుగుతుందన్నారు. ఉచిత ఇసుక పాలసీలో ఒక్కరికి 20 టన్నుల పరిమితికి మేరకు మాత్రమే ఇసుక పంపిణీ చేయించడం జరుగుతుందని ఇసుక రవాణా స్టాక్ పాయింట్ల నుండి మాత్రమే ఆన్లైన్ పేమెంట్ ద్వారా తీసుకోవాలని సూచించారు.

మైనర్ డ్రైవింగ్‌లపై కఠిన చర్యలు

మైనర్ డ్రైవింగ్‌లపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఎస్.సురేష్ కుమార్ రెడ్డి హెచ్చరించారు బుధవారం పోలవరం సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించాలని మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై సైతం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగన్ దొంగ దీక్షలు చేస్తున్నారు
దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

విశాలాంధ్ర-పెదవేగి: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక ఢిల్లీలో జగన్ దొంగ దీక్షలు చేస్తున్నారని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ వ్యాఖ్యానించారు. బుధవారం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో పలువురు నాయకులు, కార్య

కర్తలు, అధికారులు, ప్రజలు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు స్థానిక సమస్యలను, ఆరోగ్య సంబంధమైన సమస్యలు వంటివి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకు రాగా, ప్రజల కష్టాలను, సమస్యలను ఆలకించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ వైసిపి చేసిన అవినీతి అరాచక పాలనను ప్రజలు తిరస్కరించడంతో జగన్ ఓర్వలేక ఉద్రేకానికి లోనవుతున్నారని, అందుకే శవ రాజకీయాలు చేయటానికి ఎల్లప్పుడూ నేనున్నా అంటూ ముందు ఉండే జగన్ రాష్ట్రంలో రాజకీయ హత్యలు అంటూ అసత్య ప్రచారాలు చేస్తూ ఢిల్లీలో ధర్నాలు అంటూ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లు బాబు), బొప్పనసుధ, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు, సహా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలాల్లో వర్షపు నీటిని సత్వరమే బయటకు తరలించాలి

విశాలాంధ్ర- ముదినేపల్లి : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ముంపు బారిన పడిన వరిపొలాల్లో, నారుమళ్ళల్లో వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. మండలంలోని అల్లూరు, కోర్రగుంటపాలెం , బొమ్మినంపాడు గ్రామాల్లో పర్యటించారు. ఈ

సందర్భంగా ఏడిఏ వెంకటమణి రైతులకు పలు సూచనలు చేశారు. విత్తిన 7 నుండి 30 రోజులలోపు నారు 5 రోజుల కన్నా ఎక్కువ నీట మునిగిన నారు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తక్షణం నీటిని బయటకు తీసి 5 సెంట్ల నారుమడికి 1 కిలో యూరియా, 1 కిలో పొటాష్ వేసుకోవాలన్నారు. ఒక గ్రాము కార్బెన్డిజియ్ లేదా 2 గ్రాములు కార్బెన్డిజియ్ తో మాంకోజెబ్ పిచికారి చేయాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి పి. వేణుమాధవ్ , విఎఎలు , దావు నాగరాజు , రైతులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు ఆహారం, కంచాలు, గ్లాసుల పంపిణీ

విశాలాంధ్ర -భీమవరం: ఆపదలో ఉన్నవారిని, విపత్తు పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నవారిని ఆదుకోవడం భగవత్ సేవతో సమానమని జనసేన పట్టణ అధ్యక్షులు చెన్నమల చంద్రశేఖర్, జిల్లా నాయకులు బండి రమేష్ కుమార్, పొత్తూరి బాపిరాజు అన్నారు. మెంటేవారితోటలోని 350 మంది యనమదుర్రు డ్రైన్ ముంపు బాధితులకు శ్రీవిజ్ఞానవేదిక, కూటమి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు కుమారుడు ప్రశాంత్ సౌజన్యంతో ఆహార పొట్లాలు, పొత్తూరి బాపిరాజు సౌజన్యంతో 200 కంచాలు, గ్లాస్ లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 4 రోజులుగా ముంపు బాధితులకు దాతలందిస్తున్న సహకారం అద్వితీయమని, మానవత్వంతో ముందుకు వస్తున్న దాతలను వారు అభినందించారు. ఈ ప్రాంతాన్ని ఎమ్మెల్యే శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నారని, అసెంబ్లీలో కూడా ఈ విషయంపై మాట్లాడారని, నిరంతరం మేమంతా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, జనసేన నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, లోవరాజు, మాజీ కౌన్సిలర్లు మెంటే గోపి, ఎద్దు ఏసుపాదం, లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, వీఆర్వో అడవి శ్యామ్, ముచ్చకర్ల సుబ్బారావు, మెంటే మనోజ్, తోట సురేష్, ఇందుకూరి శివాజీ వర్మ, ఇందుకూరి సుబ్రహ్మణ్య రాజు, ఉప్పులూరి చంద్రశేఖర్, కొండ్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : విద్యార్థులు చదువులలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాజవరం గ్రామపంచాయతీ సర్పంచ్ ఏలేటి చిన్నతుక్కయ్య పేర్కొన్నారు. మండలంలో రాజవరం గ్రామంలో వి.ఎస్.ఆర్ జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద విద్యార్థినీ, విద్యార్థులకు బుధవారం

ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న విద్యాసామాగ్రిని సర్పంచ్ తుక్కయ్య చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా తుక్కయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ, విద్యార్థిని, విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫామ్, బెల్ట్‌లతో పాటు, ప్రతి ఏటా 15 వేల రూపాయలు నగదు జమ చేయడం హర్షించదగ్గ విషయమని, విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని చదువులలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ ఏలేటి.రాజు ,తమిర్చి బ్రహ్మయ్య, కోలా జ్యోతి,టిడిపి నాయకులు కే.రాజేశ్వరరావు, ఆర్. పతిరాజు, బి. బాబురావు, ఎస్. శ్రీను, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ దొంగ అరెస్ట్

విశాలాంధ్ర - భీమవరం టౌన్: జిల్లా పోలీసులు రాబట్టిన సమాచారం ప్రకారం భీమవరం ఒకటవ పట్టణ పోలీసులు, భీమవరం, యనమదుర్రు మురుగు కాలువ గట్టు సమీపంలో నివసిస్తున్న బోను మోజేష్, 28 అరెస్టు చేసి విచారించగా మోటార్ సైకిల్ దొంగతనం చేస్తున్నట్లు ఒప్పుకోవడంతో అతని వద్ద నుండి మూడు మోటార్ సైకిళ్లను స్వాధీన పరుచుకుని విచారణ చేపడుతున్నామని, వన్ టౌన్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.చోరీ సొత్తు విలువ రు.2 లక్షల5వేలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేసిన సిబ్బందిని జిల్లా ఎస్.పి. అద్నాన్ నయీం అస్మి అభినందించారు.

30 వేల మొక్కలు గుంటూరుకు తరలింపు

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న సోషల్ ఫారెస్ట్ నర్సరీ నుండి 30 వేల మొక్కలను గుంటూరు జిల్లాకు మంగళ వారం తరలించారు. జిల్లా డీఎఫ్ఓ హిమ శైలజ ఆదేశాల మేరకు టేకు, మద్ది,నేరేడు, నెమలి, ఉసిరి జాతి మొక్కలను గుంటూరు జిల్లాలో

రిజర్వ్ ఫారెస్ట్ లో ప్లాంటేషన్ కొరకు తరలిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం సోషల్ ఫారెస్ట్ రేంజర్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు 170 హెక్టార్లలో ఈ మొక్కలను అటవీ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో నాటనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : మండలంలో వివిధ గ్రామాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంగన్వాడి కేంద్రాల సూపర్వైజర్లు, టీచర్లు పేర్కొన్నారు. కొయ్యల గూడెంలో ఐసిడిఎస్ ఆధ్వ

ర్యంలో బుధవారం అవగా హన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధార్ సేవలలో ఇప్పటివరకు అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించనున్నట్టు తెలిపారు. ముఖ్యంగా పేరులో చేర్పులు, మార్పులు, జన్మ తేదీలు,చిన్నారులకు సంబంధించి వేలిముద్రలు, బయోమెట్రిక్ తదితర సమస్యలను పరిష్కరించుకోవచ్చు అన్నారు. అంగన్వాడి కేంద్రాల సూపర్వైజర్స్ అంబటి సరస్వతి. నయోమీరాణి అంగన్వాడీ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు అయ్యంకి సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-భీమడోలు: గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య చేసిన కృషి అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో బుధవారం అయ్యంకి వెంకటరమణయ్య 135 వ జయంతి వేడుకలు నిర్వహించారు. గ్రంథ పాలకుడు కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమంలో ఆయన జీవితాంతం కృషి చేశారన్నారు. గ్రంథాలయాలు ఏర్పాటు చేసి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. చిన్నారులు విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం :జగన్మోహన్ రెడ్డి మద్యం జే బ్రాండ్ డిజిటల్ ట్రాన్సాక్షన్స్ లేకుండా గల్లా పెట్టి నింపుకున్న తీరుపై అసెంబ్లీలో బుధవారం తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ దుమ్మెత్తి పోశారు. మద్యం ఆంధ్ర ప్రదేశ్ గా జగన్మోహన్ రెడ్డి చీప్ లిక్కర్‌తో మార్చేశారని విమర్శించారు. స్పిరిట్‌ను రాష్ట్రంలో అమ్మారని ఎంతోమంది

ఆరోగ్యం దెబ్బతిన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా రాష్ట్రంలో మద్యం షాపుల్లో జే బ్రాండ్ సరుకు ఉందని దానిని అమ్మకూడదని పేర్కొన్నారు. నాణ్యమైన లిక్కరు షాపులను మూయించి జగన్ బ్రాండ్ మద్యం మాత్రమే తయారు చేసి అమ్మారని విమర్శించారు.

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విశాలాంధ్ర - నిడమర్రు: కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెంది విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తుందని ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో చదవాలని నిడమర్రు ఎంఈఓ-2 కె.రాంబాబు అన్నారు. బుధవారం నిడమర్రు మండలం సిద్ధా పురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు స్టూడెంట్ కిట్టును అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు బ్యాగులు షూలు సాక్స్ యూనిఫామ్ మొదలైన సౌకర్యాలు కల్పించి మంచి విద్యను అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదిరెడ్డి

సత్యవతి ఎంఈఓ చేతుల మీదుగా విద్యార్థులకు కిట్లు అందజేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదిరెడ్డి రామచంద్రరావు సొంత ఖర్చులతో వితరణగా విద్యార్థులకు 10వేల రూపాయలు విలువ చేసే నోటు పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నౌడు రాంబాబు స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు కురెళ్ళ రవి ప్రకాష్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని యువతిని మోసగించిన కేసులో ముద్దాయికి జైలు శిక్ష

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిని శారీరకంగా అనుభవించడమే కాకుండా ఆమె నుండి డబ్బు తీసుకుని మోసం చేసిన కేసులో నాని అనే నిందితుడికి నాలుగేళ్ళు జైలు శిక్ష , ఐదు వేలు జరిమానాను ఏలూరు మహిళా కోర్టు ఐదవ అదనపు జిల్లా జడ్జి జి. రాజేశ్వరి విధిస్తూ తీర్పు చెప్పారు.వివరాల్లోకి వెళ్తే పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణం గునిపూడి ప్రాంతంలోని బ్రిడ్జిపేటకు చెందిన మద్దా ప్రవీణ్ కుమార్ అలియాస్ నాని భీమవరం సీతమ్మవారి సెంటర్ లోని పోతులవారిపేట చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో పెళ్ళి చేసుకుంటానని పలు మార్లు శారీరకంగా అనుభవించాడు. తరువాత ప్రియుడు ప్రవీణ్ అనుమతితో ఆమె కుటుంబ పోషణ కోసం కువైట్ వెళ్ళింది.వారి పెళ్ళి ఖర్చుల కోసం ప్రవీణ్ కు కువైట్ నుంచి బ్యాంకు అకౌంట్ ద్వారా దఫ దఫాలుగా రు.80వేలు వచ్చే జీతం నుంచి పంపింది. ప్రవీణ్ పెళ్ళి చేసుకుందాం వచ్చి వేయమనగా కువైట్ నుంచి తిరిగి వచ్చేసింది. ఆమె వచ్చిన తరువాత కూడా ఆమె వద్ద ఉన్న డబ్బు తీసుకుని శారీరకంగా అనుభవిస్తూ నాలుగు నెలలైనా పెళ్ళి చేసుకోకుండా కాలయాపన చేయడంతో పెద్దల్లో పెట్టి అడిగినా వివాహం చేసుకోకపోవడంతో బాధితురాలు 2019 జూన్ లో భీమవరం వన్ టౌన్ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసింది. దానిపై అప్పటి ఎస్ఐ పి.చంద్రశేఖర్ కేసు నమోదు చేయగా సిఐ గోవింద రాజు, కృష్ణభగవాన్ లు విచారణ చేసి కోర్టులో ఛార్జ్ షీటు దాఖలు చేశారు. సదరు కేసులో సాక్షులను భీమవరం వన్ టౌన్ పోలీసులు ప్రవేశ పెట్టారు. కోర్టులో సాక్ష్యాలు చెప్పించి, బాధితులు తరపున వాదనలు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డివి.రామాంజనేయులు వినిపించారు. కోర్టులో నిందితుడు మద్దా ప్రవీణ్ కుమార్ పై నేరం ఋజువు కావడంతో నాలుగేళ్ళు జైలు శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమానా విధిస్తూ మహిళా కోర్టు ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి తీర్పు చెప్పినట్లు ఆ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.వి.రామాంజనేయులు తెలిపారు.

వృత్తికి వన్నెతెచ్చేలా వైద్య సిబ్బంది సేవలందించాలి
కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు : సమాజంలో వైద్యవృత్తికి ఉన్న గౌరవానికి మరింత వన్నె తెచ్చే విధంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి హెచ్చరించారు. జిల్లాలో పారిశుధ్యం, వైద్యసేవలు, విద్య, తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తిని ప్రాణాపాయం నుండి రక్షించేది వైద్యుడిని, అటువంటి వైద్యుడిని ప్రతీ ఒక్కరూ దేవుడిగా కొలుస్తారన్నారు. అటువంటి వైద్యవృత్తిలో ఉన్న వైద్యసిబ్బంది ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించే దిశగా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. గర్భిణీలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ రక్తహీనత, తదితర ఆరోగ్య సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లపై ఉందన్నారు. నూరు శాతం పిల్లలకు వాక్సినేషన్ పూర్తి చేయవలసి ఉండగా, లక్ష్యసాధనలో వెనుకబడిన బంగినపల్లితోట, రమణక్కపేట, ధర్మాజీగూడెం వైద్యాధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి మెరుగుపడాలి : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి మెరుగుపరచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి మెరుగుపరచడంలో మండల విద్యా శాఖాధికారుల పాత్ర ప్రధానమైనదన్నారు. పాఠశాలల్లో విద్యాబోధన, విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయి పరిశీలించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా ప్రత్యేక పర్యవేక్షణతో ఎంఈఓ లు ఉపాధ్యాయులను ప్రేరణ చేస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి పెరగడం పెద్ద కష్టం కాదన్నారు. జిల్లాలో డ్రాప్ ఔట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాకాలం సందర్భంగా జిల్లాలో అపరిశుభ్ర పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. శర్మిష్ఠ, డీఈఓ అబ్రహం, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాధ్, ప్రభృతులు పాల్గొన్నారు.

తూర్పుమెట్ట గ్రామాన్ని సందర్శించిన ఆర్డిఓ

విశాలాంధ్ర-వేలేరుపాడు: వేలేరుపాడు మండలం తూర్పుమెట్ట గ్రామాన్ని బుధవారం జంగారెడ్డిగూడెం ఆర్డివో కె. అద్దయ్య సందర్శించారు. బాధితులను వారికి అందుతున్న సౌకర్యాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా బాధితులకు నిత్యావసర

సరుకులు బియ్యం, కూరగాయలు, పాలు, కొవ్వొత్తులు, వాటర్ ప్యాకెట్లు, మస్కిటోకాయిల్స్, బిస్కట్లు అందజేశారు. ఏలూరు రెడ్ క్రాస్ సొసైటీ నుండి వచ్చిన వస్తువులను కూడా తూర్పుమెట్ట వరద బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన భద్రాచలం వద్ద 48 అడుగుల నీరు చేరగా తూర్పుమెట్ట గ్రామానికి వెళ్ళు మార్గము నీట మునగడంతో సహాయ పునరావాస చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. వేలేరుపాడు మండలంలో 36 గ్రామాలు వరద ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించి సహాయ చర్యలు నిర్వహిస్తున్నామన్నారు. కోయిదా, కటుకూరు, నార్లవరం, రుద్రంకోట, తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము పంచాయితీల్లోని వరద ప్రభావిత కటుంబాలకోసం 4 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో భోజనం, పాలు, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం శివకాశీపురంలో గల పునరావాస కేంద్రానికి వేలేరుపాడు గ్రామం నుండి 27 కుటుంబాలను, నెమలిపేటలోని ఆర్ అండ్ ఆర్ కాలనీకి రేపాకగొమ్ము నుండి 270 కుటుంబాలను తరలించడం జరిగిందన్నారు. ప్రభావిత గ్రామాల్లో కూరగాయలు, పాలు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, వాటర్ ప్యాకెట్లు, మస్కిటో కాయిల్స్, బిస్కట్లు, 1490 టార్పాలిన్లు పంపిణీ చేశామన్నారు. ముందస్తుగా అవసరం మేరకు మరిన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. సహాయ చర్యలకోసం ఎన్ డిఆర్ఎఫ్, ఎస్ డిఆర్ఎఫ్, ఫైర్ డిపార్ట్ మెంట్ బృందాలను అందుబాటులో ఉంచామన్నారు. వరదలకు ముందే బియ్యం, కందిపప్పు నిల్వచేయడం జరిగిందన్నారు. ఆర్ డబ్ల్యుఎస్ సిబ్బంది గ్రామానికి సరిపడా వాటర్ ప్యాకెట్లు ముందుగానే అందజేశారన్నారు. ఆర్డివో వెంట వేలేరుపాడు తహశీల్దారు జి. చిన్నారావు, ఇతర శాఖల సిబ్బంది ఉన్నారు.

మండల విద్యాభివృద్ధి పరుగులు

విశాలాంధ్ర - పెంటపాడు: పశ్చిమ గోదావరి జిల్లా,పెంటపాడు మండలంలో ఎంఈఓ-2 గా టీవీ.రామకృష్ణ విధులలో చేరిన నాటి నుండి,నిరంతర కృషితో మండలంలోని విద్యాభివృద్ధి పరుగులు పెడుతున్నదని, ఆకుతీగపాడు గ్రామ సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు అభినందించారు. బుధవారం ఎంఈఓ-2 టీవీ.రామకృష్ణ ఆకుతీగపాడు గ్రామాన్ని సందర్శించి,నూతన ఎ సి ఆర్ ను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఉపాధ్యా

యులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని,నెంబర్-1, నెంబర్-2 పాఠశాలలను సందర్శించి,విద్యా ప్రవేశం,శిక్షా సప్తాహం,మధ్యాహ్న భోజనం, శానిటేషన్, స్టూడెంట్ కిట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శివకుమార్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ కొల్లూరి గురు రామారావు,మాజీ సర్పంచ్ బుద్దన ధనరాజు,జనసేన నాయకులు ఆకుల నాని,ఉపాధ్యాయుడు నరేష్ లు ఎంఈఓ-2 టీవీ.రామకృష్ణను ఘనంగా సన్మానించారు.అనంతరం సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు,మాజీ సర్పంచ్ బద్దన ధనరాజు, ఉప సర్పంచ్ కొల్లూరి పండు,ఆకుల నాని మాట్లాడుతూ ఎంఈఓ.2 టీవీ.రామకృష్ణ ఉపాధ్యాయులకు, అధికారులకు,ప్రజాప్రతినిధులకు,అందుబాటులో ఉంటూ,మండల విద్యాశాఖలో ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి చేయడం గొప్ప విషయం అన్నారు. ఈయన సారథ్యంలో ఉపాధ్యాయులందరూ చక్కటి స్ఫూర్తి పొందుతూ, కష్టపడి పని చేస్తూ,ఆయన చూపిన బాటలో విద్యార్థులను అభివృద్ధి చేయడమే ఉపాధ్యాయులలో ఆయనకున్న ఆదరాభిమానానికి నిదర్శనం అన్నారు.

వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి పై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: వివాహిత పట్ల అసభ్య కరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ ఐ డి దుర్గా మహేశ్వర రావు తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన చెలికాని స్వాతి బొర్రంపాలెం గ్రామ సెంటర్‌లో జూలూరి కరుణ షాపును ఒక సంవత్సరానికి లీజుకు అగ్రిమెంట్ చేసుకుని సమారు 4 నెలల నుంచి టీ స్టాల్ పెట్టుకుని జీవనం సాగిస్తుంది.ఆమె టీస్టాల్ ప్రదేశంలో ఒంటరిగా ఉన్న సమయంలో కరుణ వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించి ఫిర్యాది ఒంటిపై చేతులు వేయగా పెద్దల్లో పెట్టి మందలించి నప్పటికీ మరలా రెండో సారి ఆమెను పట్టుకొని తన కోరిక తీర్చమని, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించినట్లు స్వాతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : గోదావరి పరివాహక ప్రాంతాల అపర భగీరథుడు, సర్దార్ కాటన్ దొర అని నీటి పారుదల శాఖ ఏఈ భాస్కర్‌రావు తెలిపారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ఉన్న నీటిపారుదల శాఖ కార్యాలయం వద్ద కాటన్ దొర వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు

లు అర్పించారు. ఈ సందర్భంగా ఏఈ భాస్కరరావు మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతాలలో గోదావరి నది పైన, కాలువల పైన, వంతెనలు నిర్మించడం, రైతు వ్యవసాయం చేసుకోవడానికి నీరు ఎంతో అవసరం కాబట్టి డ్యాములు కూడా నిర్మించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన సముద్రపు నీటిమట్టం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ఉప్పాడ సముద్రం సాధారణ సమయంలో కన్నా బుధవారం ముందుకు వచ్చింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ఉప్పాడ సముద్రం బురదగా ఉండడంతో పాటు, నీటిమట్టం పెరిగింది. సుబ్బంపేట, పల్లిపేట, సూరాడపేటలో సముద్రం ఉరకలు వేస్తూ సముద్రపు అలలు జియో ట్యూబును తాకడం, ఉప్పాడ, కాకినాడ బీచ్ రోడ్డుకు అతి దగ్గరలో సముద్రం రావడం విచిత్రంగా ఏర్పడింది. అటుగా వెళ్లే ప్రయాణికులు సముద్రాన్ని చూసి ఆశ్చర్యానికి గురవుతున్నారు. కోతకి గురికాకుండా వేసిన జియో ట్యూబు అవతల వైపుకి సముద్రం ఎగసి బడింది. అదేవిధంగా సుబ్బం పేట, పల్లిపేట సమీపంలో వేసిన బండరాళ్లు సైతం అలలు ఎగసి పడ్డాయి. అలల తాకిడికి రాళ్లు రోడ్డుపైకి చొచ్చుకు వస్తున్నాయి. ఎస్‌పి జిఎల్ సమీపంలో చిన్న బిడ్జి వద్ద అలలు ఉవ్వెత్తున ఎగసి పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు గురయ్యారు. ఎన్నడు లేనివిధంగా సముద్రం ముందుకు వచ్చిందంటే రానున్న రోజుల్లో మరిన్ని తుఫాన్లు రానున్నట్లు పలువురు చెబుతున్నారు.

రైతు బాంధవుడు సర్‌ఆర్థర్ కాటన్

విశాలాంధ్ర - అనపర్తి : గోదావరి పరివాహక ప్రాంత రైతుల బాంధవుడు, అన్నదాత సర్ ఆర్థర్ కాటన్ అని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం కాటన్ వర్ధంతి సందర్భంగా రామవరంలో ఆయన విగ్రహానికి వైసిపి నేతలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గొలుగూరి గౌతమి, పీహెచ్సీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, మండల పార్టీ అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, కర్రి రామచంద్రారెడ్డి,కర్రి గోపాలరెడ్డి కర్రి గాంధీరెడ్డి కొవ్వూరి ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కానూరులో డ్రైనేజ్ పనులు ముమ్మరం

విశాలాంధ్ర - పెరవలి : మండలంలోని కానూరు గ్రామంలో మునిగిన పంట పొలాలను పరిశీలించడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో కానూరు గ్రామంలో వర్షాలకు ముంపుకు గురైన పంట పొలాల్లో నీటిని మళ్లించే చింతలకోడె డ్రైను దొరయ్య కాలువలను జెసిబిల ఇతర పనిముట్ల సాయంతో తవ్వకం పనులు శుభ్రం చేసే పనులు మంగళవారం చేపట్టారు. బుధవారం పెరవలి ఎంపీడీవో కే హిమామహేశ్వరి కానూరు సర్పంచ్ భావన మధు పూర్ణచందులు ఈపనులను పర్యవేక్షించారు. పెరవలి మండల ఇరిగేషన్ ట్రెన్స్ ఆర్ అండ్ బి అధికారులు సమిష్టి కృషితో ఈపనులు చేపట్టారు. ఈపనులు పూర్తయితే వేగంగా నీరు బయటకు పోతుందని తద్వారా ముంపు నుండి పొలాలు బయటపడతాయని అధికారులు చెబుతున్నారు.

గుంతలను పూడ్చిన పెదపట్నం లోకల్ బాయ్స్

విశాలాంధ్ర - మామిడికుదురు : పెదపట్నం గ్రామంలోని ప్రధాన ఆర్ అండ్ బి రహదారి గుంతలమయంగా మారి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక యువకులు చొరవ చూపి శ్రీ కనక దుర్గమ్మ ఆలయ పరిసరాల్లో అధ్వాన్నంగా ఉన్న గుంతలపై గ్రావెల్ వేసి గుంతలను పూడ్చారు. గ్రావెల్ కంకర సేకరించి వాటిని తోపుడు బండిపై ఎగుమతి చేసి ద్విచక్ర వాహనంపై తీసుకువచ్చి గోతులలో వేసి చదును చేశారు. సామాజిక స్పృహ కలిగిన యువతను పలువురు అభినందిస్తున్నారు.

విద్యారంగాన్ని నీరుగార్చే బడ్జెట్ : ఏపీటీఎఫ్

విశాలాంధ్ర - తాళ్ళపూడి : కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యా రంగానికి కేవలం 3.25 శాతం నిధులు కేటాయించడం పట్ల తూర్పుగోదావరి జిల్లా శాఖ తీవ్ర అసంతృప్తి వెలిబుస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు తెలిపారు. విద్యా రంగానికి 6శాతం నిధులు కేటాయించవలసిన పాలకులు ఆ దిశగా కేటాయించక పోవడం దురదృష్టకరం అన్నారు. ప్రధాన కార్యదర్శి పత్తి సువర్ణ రాజు మాట్లాడుతూ పాతపెన్షన్ పునరుద్ధరణ ఊసే లేకపోవడం విచారకరం ఆయన అన్నారు

ఏలేశ్వరంలో స్వచ్ఛతా వారోత్సవాలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : నగర పంచాయతీ పరిధిలో స్వచ్ఛత వారోత్సవాలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రాథమిక పాఠశాల, బాలికోన్నత పాఠశాల, షిర్డి నగర్ పార్క్ లో మొక్కలు నాటే కార్యక్రమం నగర పంచాయితీ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలను నాటడం వల్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ మనకు అందుతుందని, చెట్లు ఎక్కువ ఉండడం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎండగుండి నాగబాబు, కోనాల వెంకటరమణ, టిడిపి నాయకులు జొన్నాడ వీరబాబు, రాయుడు చిన్న, మున్సిపల్ కమిషనర్ కే శివప్రసాద్, మేనేజర్ కే శ్రీనివాసరావు, ఎంఈఓ లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సెక్రెటరీలు, టిడిపి పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిరిపురంలో పొలంబడి కార్యక్రమం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని సిరిపురం గ్రామంలో ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ ఆదేశాల మేరకు ఖరీఫ్-2024 సీజన్‌కు పొలం బడి గ్రామసభను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దాపురం ఏడిఏడి ఆర్సి విభ్రమరాంబ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా 14 వారాలు ఎంచుకున్న 25 ఎకరాల క్షేత్రస్థాయిలో సాంకేతిక, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇవ్వబడుతుందని ఆమె తెలిపారు. మండల వ్యవసాయ అధికారి బి జ్యోతి మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుపై అవగాహన, మండలంలోని అన్ని గ్రామాలలో కల్పించడం, రైతులకు రాగి విత్తనాలు పంపిణీ చేశామన్నారు. రాగి విత్తనాలకు కావలసిన రైతులు తమ గ్రామాల్లో రైతు సేవా కేంద్రానికి వెళ్లి తీసుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పీతల నూకరాజు, ఎంపీడీవో జె శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎంవిఆర్‌ఆర్ వర్మ, విఏఏ మణికంఠ, డిఎ బి వెంకటకొండ, గ్రామ నాయకులు సంఘన ప్రభుజి, దనేకల అదృష్టదీపుడు, దొడ్డి శ్రీనివాస్, వెలుగురిహరేరామ, చిలకమర్తి ఆదినారాయణ, ఉప సర్పంచ్లు, ఎంపీటీసీలు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కాలనీలో తీరిన కరెంటు కష్టాలు

విశాలాంధ్ర - గండేపల్లి : మండలంలోని మల్లేపల్లి గ్రామం కొత్తూరు అంబేద్కర్ కాలనీలో ఎన్నో ఏళ్లుగా కరెంట్ లైన్ లేకపోవడంతో అంబేద్కర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ సహకారంతో గ్రామ ఉపసర్పంచ్ దొమ్మా శ్రీను పర్యవేక్షణలో నూతన కరెంట్ లైన్ వేశారు. ఇబ్బందులను తీర్చిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకి, ఉపసర్పంచ్ దొమ్మా శ్రీనుకి కాలనీవాసులు ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లైన్ మేన్ రాజు, అసిస్టెంట్ లైన్మెన్ రమణ, గంధం కాపు, బాలాజీ, జునుపే రాజు పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గుతున్న వరద ఉధృతి

- ఊపిరి పీల్చుకుంటున్న లంక వాసులు
- దెబ్బతిన్న ఉద్యానవన పంటలు

విశాలాంధ్ర - మామిడికుదురు : ధవళేశ్వరం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నప్పటికీ వైనతేయ నదికి వరద ఉధృతి క్రమేపీ తగ్గుతూ వస్తోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు అందరూ ఊపిరి పీల్చుకుంటున్నారు. మామిడికుదురు మండలంలో వరద ప్రభావం అంతగా లేనప్పటికీ నదీ తీరాన ఉన్న పలు లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నివాసాల చుట్టూ వరద నీరు తిష్ట వేసి ఉండటంతో దోమలు, విష సర్పాల బెడద తీవ్రంగా ఉందని భయాందోళన చెందుతున్నారు. పెదపట్నం గ్రామంలోని అరుంధతి పేట, రత్నాపురం ప్రాంతాల్లో వరద నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పాశర్లపూడి బాడవలోని ఒక దేవాలయంలోకి, పల్లపపాలెం లోని పలు నివాసాల ముంపునీరు నిల్వ ఉంది. శ్రీరామ పేటలో వరద నీరు ఉధృతంగా ఉండటంతో స్థానికులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. మండల పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలలో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. మధ్య లంకలో చిక్కుకున్న పలు మూగ జీవాలని స్థానికులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అప్పనపల్లి కాజ్‌వేపై వరద నీరు అడుగున్నర మేర పొంగి ప్రవహిస్తూ ఉండటంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. వరద నీటిలో ప్రయాణిస్తున్న ఒక కాళీ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టగా డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారి ఆలయంలో ముందస్తుగా దర్శనాలు నిలిపివేసారు. ఆలయం చెంతనున్న పుష్కర స్నాన ఘట్టం పూర్తిగా నీట మునిగింది. మండల స్థాయి అధికార యంత్రాంగం అప్రమత్తమై ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని ఉన్నతాధికారులకి చేరవేస్తున్నారు. గోదావరి లంకలో ఉన్న ఉద్యాన వన పంటలు వరద నీట మునిగిపోయాయనీ, లక్షల్లో పెట్టుబడిలు పెట్టిన తమని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత సరఫరాకు ఏటువంటి ఆటంకం కలగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వరి సాగులో శాస్త్రీయ విధానాలు... పాటిస్తే నాణ్యమైన దిగుబడులు

విశాలాంధ్ర - అనపర్తి : వరి సాగులో శాస్త్రీయ విధానాలతో, శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని, రసాయనాలను తగ్గించి కలుషితాలు లేకుండా పండిస్తే ఆహర ఉత్పత్తికి ఎగుమతుల అవకాశం రావడమే కాకుండ గిట్టుబాటు ధర లభిస్తుందని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు అన్నారు. బిక్కవోలు మండలం బలభద్రపురంలో ఎలుకల నివారణపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ ఎలుకల నివారణకు అనేక మార్గాలు ఉన్నాయని ఇటీవల కాలంలో 'ఎర- తెర' పద్ధతి ప్రాముఖ్యం పొందిందని ఈ విధానం పాలిథీన్ షీట్ గోడగా తయారుచేసుకొని ఎలుకల ఇనుపబోనులను ఉపయోగించడం వల్ల, ఎలుకలు వాటిలో బంధించబడతాయని తెలిపారు.దీంతో ఎలుకల సంఖ్య గణనీయంగా తగ్గుతుందన 'ఎర- తెర' ప్రక్రియను రైతులకు వివరించారు. ఎడిఎ డి.వి.కృష్ణ మాట్లాడుతూ సేంద్రియ విధానంలో రసాయనాలు లేని విధంగా సాగు చేస్తే వరిలో నాణ్యమైన ఉత్పత్తులు పొందవచ్చన్నారు. ఈ సదస్సులో డిఆర్‌సిఎడిఎ ఎస్ జయరామలక్ష్మి, బిక్కవోలు ఎవో శామ్యూల్ జాన్, ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ అమ్మాజి, డాక్టర్ హైమజ్యోతి, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

గట్టెక్కిన గోదావరి.. వరద నీటిలో ఆలయాలు

విశాలాంధ్ర - కొవ్వూరు : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో ఉన్న స్నాన ఘట్టాల వద్ద ఉన్న మెట్ల పైకి గోదావరి వరదనీరు చేరుకుంది. దీంతో ఒడ్డున ఉన్న అన్ని ఆలయాలు నీట మునిగాయి. దీంతో పోలీసులు స్పందించి క్షేత్రంలోకి స్నానం చేయడానికి లోపలికి రాకుండా తాళ్లతో అడుకట్టు వేశారు. మరోవైపు పట్టణ సీఐ జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. పితృ కర్మలు నిర్వహించేవారు క్షేత్రంలోకి రాకూడదని ఆంక్షలు విధించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - దేవరపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని దుద్దు కూరు సర్పంచ్ బొంత నాగమణి దేశం నేత ముళ్ళపూడి దురాజి చౌదరి సొసైటీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ పేర్కొన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరు లో బుధ వారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులు నర కడం వలన పర్యావరణంలో మార్పు వచ్చి అనేక అనర్ధాలు జరుగుతూనే ఉన్నాయి. పర్యావరణాన్ని పరీక్షించుకోవాలంటే విధిగా చెరువు గట్ల పైన పెరటి లోను బహిరంగ ప్రదేశాలలోనూ మొక్కలు నాటాలి అన్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ సరఫరా చేసిన 200 మొక్కలను నాటారు . ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంత నాగమణి సొసైటీ మాజీ అధ్యక్షుడు రామకృష్ణ తెలుగుదేశం నేత ముళ్ళపూడి దొరాజి చౌదరి నిమ్మగడ్డ ప్రసాద్ ముళ్ళపూడి శ్రీను కొండేపాటి అశోక్ కోయిలమూడి తాతారావు నున్న శివరామకృష్ణ యలమాటి ప్రసాద్ ఆళ్ల భుజంగ రావు ముళ్ళపూడి సత్యనారాయణ కరుటూరి శ్రీరామ్మూర్తి గ్రామ కార్యదర్శి బి రామచంద్రరావు పాల్గొన్నారు .

విద్యార్థులకు సౌకర్యాల కల్పనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం

విశాలాంధ్ర - గండేపల్లి : ప్రైవేట్ పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని సర్పంచ్ బిక్కిన దేవి దుర్గ గంగాధర్ అన్నారు. బుధవారం గండేపల్లి మండలం ఎన్‌టి రాజాపురం గ్రామంలో ప్రధానోపాధ్యాయులు ఉండవల్లి భాస్కర్ అధ్యక్షతన సర్పంచ్ బిక్కిన దేవి దుర్గ గంగాధర్ ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న 65 మంది విద్యా ర్థులకు రెండు జతలు యూనిఫాం, బ్యాగు, బూట్లు, టెక్స్ట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో అధిక సొమ్ము వెచ్చించి ఆర్థిక స్తోమత లేని తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ మంచి విద్య బోధిం చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని విద్యార్థులను చదివించుకోవాలని, నిరుపేద కుటుంబ సభ్యు లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పాలచర్ల సత్యనారా యణ, బిక్కిన వెంకట్రావు, పరిమి నాగేశ్వరరావు, అలియాస్ బూసు బాబు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పునరావాస కేంద్రాల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం (డిడిఆర్‌సి), చైర్మన్, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆద్వర్యంలో బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం (డిడిఆర్‌సి) ప్రగతి పై జిల్లా మానేజ్ మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం, నిర్వహణ సంస్థ అయిన ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ, కాకినాడ సంస్థ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ కె నారాయణ రెడ్డి, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం కార్యక్రమాలు గూర్చి 2023-2024 వార్షిక ప్రగతిని కమిటీ సభ్యులకు వివరించారు. సహాయ సంచాలకులు, జిల్లా విభిన్న ప్రతిబావంతుల, వయోవృద్దుల మరియు ట్రాన్స్ జెండర్ సంక్షేమ శాఖ, కాకినాడ జిల్లా పి నారాయణమూర్తి జిల్లాలో నిర్వహిసతున్నటువంటి దివ్యాంగుల శిబిరాలకు డిడిఆర్‌సి సిబ్బంది అందరూ పాల్గొని దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ పరికరాలను పొందుటకు, వాటి నిర్వహన పట్ల, వికలత్వ నివారణ పట్ల, దివ్యాంగులకు ఉన్నటువంటి సదుపాయాలు పట్ల అవగాహన కార్యక్రమాలను మండల స్తాయిలో ప్రభుత్వ అధికారుల సమన్వయంతో నిర్వహించడం జరుగుతుందని తెలియచేసారు. జాతీయ శారీరక వైకల్య నిర్వహణ సంస్థ వారు గత క్యాంపులో గుర్తించిన దివ్యాంగులకు 2024 ఆగష్టు 8వ తేదీన బ్యాట్రీ మూడు చక్రాల సైకిళ్ళు, మరియు వీల్ చైర్సను జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం, నిర్వహణ సంస్థ అయిన ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ, కాకినాడ సంస్థ ప్రాంగణములో బహుకరించడం జరుగుతుందని ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ ఎస్ పి రెడ్డి జిల్లా కలెక్టర్‌కి వివరించారు. 2024 ఆగస్టు 2 నుంచి 9వ తేది వరకు భారత ప్రభుత్వ సంస్థ అలెమ్‌కో (గూరాజువీజూ) వారు కాకినాడ జిల్లాలో నిర్వహించే దివ్యాంగుల కృత్రిమ పరికరాల ప్రత్యేక శిభిరాలకు డిడిఆర్‌సి సిబ్బంది కూడా పాల్గొని జిల్లాలో ఉన్న అర్హులైన, అవసరమైన దివ్యాంగులందరికి కృత్రిమ పరికరాలు పొందటానికి సహకరించాలని అదేవిధముగా జిల్లాలోని దివ్యాంగులందరూ ఈ సదఅవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. అదే విధముగా వికలత్వము, నివారణ పట్ల అవగాహన కార్యక్రామాలను జిల్లాగ్రామీణాభివృద్ధి సంస్థ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గవర్నమేంట్ జనరల్ ఆసుపత్రి, కాకినాడ, సాంఘిక సంక్షేమ శాఖల సన్వయంతో నిర్వహించాలని దానికి అవసరమైన ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలని ఆయన సూచించారు. అదే విధముగా జిల్లా స్థాయిలో ప్రభుత్వము తరుపున దివ్యాంగుల పునరావాస కేంద్రం నిర్వహణకు తనవంతు సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించి సీఎస్‌ఆర్ నిధులతో అవసరమైన వనరులను సమకూర్చు కోవాలని తెలియచేసారు. అనంతరము జిల్లా అధికారులను వారి సలహాలు, సూచనలను అడిగి వాటిని రాబోయే ప్రణాళికలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అలాగే ప్రజలకు దివ్యాంగుల హక్కులపై, పథకాలపై, సరైన అవగాహన కల్పించి ప్రతిఒక్కరిని భాగస్వామ్యము చెయ్యాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ కె శ్రీరమణి, ఐసీడీఎస్ పీడీ కె ప్రవీణ, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ డీవీ రమణమూర్తి, కాకినాడ జిల్లా పునారావాస కార్యక్రమము యొక్క జిల్లా మానేజ్ మెంట్ కమిటీ సబ్యులు, ఇతర అధికారులు, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

జీజీయూలో అలరించిన అలనాటి రామచంద్రుడు చిత్ర బృందం

విశాలాంధ్ర - రాజానగరం : నూతన ప్రేమకథతో వస్తున్న తమ చిత్రం అలనాటి రామచంద్రుడును ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని యువ హీరో కృష్ణవంశీ అన్నారు. మండలంలోని గోదావరి గ్లోబల్ విశ్వ విద్యాలయం(జిజియు)లో అలనాటి రామచంద్రుడు సినీ బృందం బుధవారం సందడి చేశారు. ఈ సందర్భంగా హీరో కృష్ణవంశీ మాట్లాడుతూ జిజియు ఎంతో విశాలంగా సినీ షూటింగ్ స్పాట్‌లా ఉందన్నారు. హీరోయిన్ మోక్ష మాట్లాడుతూ ఆగస్టు రెండో తేదీన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. అలనాటి రామచంద్రుడు సినిమాను ప్రతి ఒక్కరూ థియేటర్లో కుటుంబ సమేతంగా చూసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సినిమా సరికొత్త ప్రేమ కథ చిత్రం అని అన్నారు. సినీ దర్శకుడు చిలుకూరు ఆకాష్ రెడ్డి మాట్లాడుతూ మరోసారి సినిమా విజయోత్సవ యాత్రలో వచ్చి కలుస్తామని అన్నారు. సినిమా టీజర్ను ప్రదర్శించడంతోపాటు సినిమాలోని పాటకు హీరో కృష్ణవంశీ హీరోయిన్ మోక్ష విద్యార్థిని విద్యార్థులు కలిసి డాన్స్ చేశారు.దీనిలో భాగంగా వర్సిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం వెంకటేష్ కాకుమాను, దివ్యశ్రీ, స్నేహమాధురి, శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత

విశాలాంధ్ర - పి గన్నవరం : మండలంలోని లంకల గన్నవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన విద్యా కానుక కిట్లను మండల పరిషత్ అధ్యక్షురాలు గనిశెట్టి నాగలక్ష్మి శ్రీనివాస్ అందజేశారు. ఈ మేరకు ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కోనా హేలీనా, సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, ఎంపీటీసీ 2 అవనిగడ్డ సత్తిబాబు, పంచాయతీ వార్డు సభ్యులు అల్లాడి నారాయణరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవన నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరం మండలం లంకల గన్నవరం గ్రామం వేమనవారి పాలెంలో నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడి కేంద్రం భవనాన్ని మండల పరిషత్ అధ్యక్షురాలు గనిశెట్టి నాగలక్ష్మి శ్రీనివాస్ పరిశీలించారు. అంగన్వాడి భవన నిర్మాణంకి సంబంధించి బాత్రూం నిర్మాణం త్వరితగతిని పూర్తి చేసి అంగన్వాడీ అని త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని ఐసిడిఎస్ సిడిపిఓ వెంకటేశ్వరితో, స్థానిక ప్రజా ప్రతినిధులతో ఎంపీపీ చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, ఎంపీటీసీ 2 అవనిగడ్డ సత్తిబాబు, టీడీపీ యువ నేత వేమన గంగాధర్ ఉన్నారు.

సుబ్బారెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పెదపూడి : ఇటీవల శస్త్ర చికిత్స చేయించు కుని విశ్రాంతి తీసుకుం టున్న పడాల సుబ్బారెడ్డిని పందలపాకలో బుధవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పరామ ర్శించారు. ఆయనతో పాటు వైసిపి నేతలు సత్తి హరిప్రసాద్ రెడ్డి, కిలపర్తి సత్య న్నారాయణ, బొడ్డు ముత్యాలరావు, గొలుగూరి సత్యనారాయణ రెడ్డి, పడాల వీర్రాఘవరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, వల్లూరి పనస రామ చౌదరి ఉన్నారు.

దయ్యాలకు వేదాలు వల్లించినట్లు ఉంది

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : పిసిసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు అధ్యక్షురాలు వైయస్ షర్మిలకు బిజెపి కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులు ఉమ్మిడి వెంకట్రావు సూటి ప్రశ్న. అమ్మ వైయస్ షర్మిల మీరు వైయస్ జగన్ మోహన్ రెడ్డిని బిజెపి అనుబంధ నేతగా మీరు విమర్శించడం దయ్యాలకు వేదాలు వల్లించినట్లు ఉన్నది. బుధవారం ఢిల్లీలో వైయస్ జగన్ ధర్నా చేస్తుంటే ఇండియా కూటమి తరపున దాదాపు 8 పార్టీల నాయకులు అఖిలేష్ యాదవ్‌తో కలిసి వచ్చి సంఘీభావం తెలియజేశారు. దీని అర్థం ఏమిటో కాంగ్రెస్ ఎఐసిసి అధ్యక్షులుగా మల్లికార్జున ఖర్గేని, మరియు పిసిసి అధ్యక్షులుగా మీరు ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఉమ్మిడి వెంకట్రావు ప్రశ్నించారు.

పారిశుధ్యం పై ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మున్సిపాలిటీలో పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాల మేరకు సామర్లకోట మున్సిపాలిటీకి స్పెషల్ ఆఫీసర్‌గా గ్రౌండ్ వాటర్ లెవెల్ అధికారి రాధాకృష్ణను నియమించారు. ఇప్పటివరకు సానిటరీ ఇన్స్పెక్టర్‌గా పని చేసిన పి శ్రీనివాసుని శానిటరీవిధుల నుండి తప్పించారు. బుధవారం సామర్లకోట మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ జాస్తి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో స్పెషల్ అధికార రాధాకృష్ణ పాల్గొన్నారు. పట్టణంలో ఒకటవ సచివాలయం నుండి 8వ సచివాలయం వరకు సిహెచ్ సాయి చరణ్‌ను 9 నుండి 15 సచివాలయం వరకు రవికుమార్‌లను సానిటరీ అధికారులుగా నియమించడం జరిగిందని, జిల్లా కలెక్టర్ పర్యటనలో సామర్లకోటలో పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేదని పారిశుద్ధ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించిన నియమాల ప్రకారం ప్రతి ఒక్కరు పనిచేయడం జరుగుతుందని ప్రత్యేక అధికారి రాధాకృష్ణ తెలిపారు. పారిశుధ్య సిబ్బందితో మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రజల నుంచి పారిశుధ్యం పై వస్తున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతామని తెలిపారు. 15 సచివాలయాలకు సంబంధించిన సానిటరీ కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

శానిటేషన్ పనులు ముమ్మరం

విశాలాంధ్ర - రాజోలు : వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాతావరణంలో మార్పులు కారణంగా విద్యార్థులు విష జ్వరాల బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రాజోలు మండలం చింతలపల్లి గ్రామ సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి సురేష్ పంచాయితీ సిబ్బందితో పాఠశాలల పరిసర ప్రాంతాల్లో బుధవారం శానిటేషన్ పనులు చేపట్టారు. శానిటేషన్ పనుల్లో భాగంగా బ్లీచింగ్ చల్లడం, ఎబేట్ వంటి దోమల నివారణ మందులు పిచికారీ చేయ్యడం వంటివి చేపట్టడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. చింతలపల్లి గ్రామంలో తొమ్మిది అంగన్వాడీ కేంద్రాల వద్ద, ఆరు ప్రభుత్వ స్కూల్ వద్ద శానిటేషన్ పనులు చేపట్టారు. అదేవిధంగా గ్రామంలో మురుకు నీటి గుంతలు ఉన్న అన్నీ ప్రాంతాల్లో శానిటేషన్ చేసినట్లు ప్రసన్నకుమారి సురేష్ తెలిపారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా గ్రామ ప్రజలు జాగ్రత్త పడాలని ఈ సందర్భంగా సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి సురేష్ చింతలపల్లి గ్రామ ప్రజలకు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొక్కా రాంకృష్ణ, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మండల ప్రత్యేక అధకారి జీవీవీవీ ప్రసాదరావు

విశాలాంధ్ర - పెదపూడి : పర్యావరణ పరిరక్షణకు అందరు బాధ్యతగా మొక్కలు నాటాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జీవీవీవీ ప్రసాదరావు అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా బుధవారం పెదపూడి గ్రామ పంచాయతీ వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పరిసరాలను, పరిశుభ్రత చర్యలను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి మొదటిగా పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అలాగా వాతావరణంలో సమతౌల్యం సాధించడానికి పర్యావరణాన్ని కాపాడుకోడానికి మొక్కలు నాటాలన్నారు. స్వచ్ఛత వారోత్సవాలు విజయ వంతంగా నిర్వహించడానికి సంబంధిత ఉన్నత అధికారులు పర్యవేక్షణ తప్పని సరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పిఆశాజ్యోతి, ఈఓపీర్డ్ ఎం సత్యనారాయణరెడ్డి, సర్పంచి కలవల కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు వల్లూరి మరియమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, టీడీపీ నేత జుత్త కృష్ణ, సచివాలయం కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛత వారోత్సవాలు నిర్వహించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

విశాలాంధ్ర - రాజానగరం : మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడతాయని సమగ్ర శిక్ష జిల్లా అధికారి అకాడమిక్ మానిటరింగ్ అదికారి గౌరీ శంకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన శిక్షా సప్తహలో కార్యక్రమంలో భాగంగా మండలం లోని దివాన్ చెరువు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నందు జరుగుతున్న కార్యక్రమాన్ని బుధవారం సందర్శించారు. దీనిలో భాగంగా క్రీడా పోటీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాలలో ప్రోత్సహించాలనీ ఉపాధ్యాయులకు సూచించారు. కంద్ర ప్రభుత్వం సూచనలు మేరకు శిక్షా సప్తహలో భాగంగా ఏడు రోజులు ప్రతి పాఠశాలలోని వివిధ అంశాలపై కార్యక్రమాలు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి గుబ్బల జ్యోతి ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.